


# మా పెళ్ళి పెద్దలు కథలే!

**- ఆర్. వసుంధరా దేవి**

రచన ప్రయోజనం ఆలోచనాపరులైన సహృదయ పాఠకుల ముందుకు వచ్చి వారి జ్ఞాపకాల్లో నిలవడం అని భావించే వసుంధరాదేవి గారు రాసిన కథలు సుమారు ఐదు పదులు. ఈమె తాత్విక నేపథ్యంతో, విస్తృతమయిన అధ్యయనంతో, లోతైన పరిశీలతో కథలు రాశారు. తన కథల నిండా జీవితంలోని 'పెంజీకటి కవ్వల' దాగున్న సత్యాన్ని చెప్పే ప్రయత్నం చేశారు. భౌతికమైన వాటికన్నా మానసికమైన వాటికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చి కథలు రాసిన ఆర్.వసుంధరాదేవి గారితో ఇంటర్వ్యూ ఈ వారం..



## ఇదంతా మా మాష్టారు చలవే!

పరిపూర్ణమ్మ, పండా సత్యన్నారాయణ చౌదరి మా తల్లిదండ్రులు. మేం ఐదుగురం అక్కచెల్లెళ్ళం. 17 డిసెంబర్ 1931న గుంటూరు జిల్లాలోని వేటపాళెంలో జన్మించాను. నేనే పెద్దదాన్ని. నాన్నగారు మెడికల్ ఆఫీసర్. మాది చాలా సంప్రదాయ కుటుంబం. అమ్మాయిల్ని ఎక్కువ చదివించకూడదనే అభిప్రాయం మా కుటుంబంలో చాలా బలంగా ఉండేది. మా నాయినమ్మ నా చదువు ఆపేయాలని పట్టుబట్టినప్పుడు ఇంట్లో మా అమ్మ, బయట మా తెలుగు మాస్టారు అబ్బరాజు సూర్యనారాయణగారు మా నాన్నతో వాదించి మరీ నా చదువును కొనసాగనిచ్చారు. నా తెలుగు భాషంతా మా మాస్టారి చలవే!

## క్లాస్‌లో నేనే టాపర్

గుంటూరు సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషు మీడియం కాన్వెంట్లో నన్ను బోర్డర్‌గా పెట్టేసారు. అక్కడినుంచి కాలు బయటపెట్టే పనిలేదు. ఇంకో మనిషితో మాట్లాడే పనీలేదు. వెనకాల పెద్ద తలుపులు మూసుకుపోయేవి. అదో జీవితం అక్కడ. మొన్న కర్నూల్లో జరిగినట్లే, మా కాన్వెంట్లో అప్పట్లోనే తెలుగులో మాట్లాడితే పిల్లల వీపునకు కార్డు అంటించి దండించే వాళ్ళు. తొమ్మిదివ తరగతిలో బాలమ్మ అనే హిస్టరీ టీచరుపైన గల ఇష్టంతో హిస్టరీని ఆప్షనల్‌గా తీసుకున్నాను. క్లాసులోంచి బయటకు చూస్తే బాటని పిల్లలు, ఆ సబ్జెక్టుకు మేడం లేదు కాబట్టి హాయిగా ఆడుకుంటూ కనిపించారు. నేను మాత్రం ఎందుకు కష్టపడాలనుకుని బాటనీకి మారిపోయాను. నేనట్లా మారిపోగానే బాటనీకి టీచరు వచ్చేసారు. ఇంకేం చేయాల్రా అని తెగ ఆలోచించి కెమిస్ట్రీకి టీచరు లేదు కదా అని కెమిస్ట్రీ తీసుకున్నాను. ఆ తర్వాత కొన్నాళ్ళకి కెమిస్ట్రీకి టీచరొచ్చేశారు. ఆ రోజుల్లో ఆడవాళ్లు కెమిస్ట్రీ చదవడం అరుదు కదా. బాంబేనుండి వచ్చారావిడ. అట్లా కెమిస్ట్రీ ఎంఎస్సీ చదివాను. మొత్తానికి క్లాసులో ఎప్పుడూ నేనే టాపర్.

నేను చాలా సన్నగా బలహీనంగా ఉండేదాన్ని. విసి వి.ఎస్.కృష్ణ గారు 'ఇన్స్ట్రుమెంట్స్ ఎట్లా మోస్తావమ్మా?' అని అంటే కెమెస్ట్రీ టెక్నాలజీ వదిలి కెమెస్ట్రీ ఆనర్స్ చేశాను. తర్వాత రీసెర్చ్ ఎమ్మెస్సీ చేశాను. ప్రొఫెసర్ ధార్ (అలహాబాద్) ఫ్రాన్స్‌లో పిహెచ్‌డీ చేయటానికి స్కాలర్‌షిప్ ఇస్తామన్నారు. ఇదంతా ఇట్లా జరుగుతూ వుంటే నాకు పెళ్ళయిపోయింది. నా చదువు అయిపోయింది.

## అప్పుడే స్పష్టత తెలిసింది

తెలుగు సాహిత్యం అంటే నాకు ఇష్టం కలగటానికి మా తెలుగు మాస్టారు అబ్బరాజు సూర్యనారాయణగారే కారణం. అప్పట్లో పద్యాలు, పదాలు వాటికి అర్థాలు శ్రద్ధగా నేర్పించే వాళ్లు. పదాలకు ఇట్లా అర్థాలు, మూలాలు ఉండటం కారణంగా నాకు భాష అంటే అభిమానం ఏర్పడింది.

'అక్కయ్యా.. కథ చెప్పూ' అని చెల్లెళ్ళు అడిగి మరీ కథలు చెప్పించుకునే వాళ్ళు. మా చెల్లెళ్ళ స్కూల్లో నాటకం వేయటానికి నన్ను రాయమన్నారు వాళ్ళ టీచర్లు. 'చదువుకున్న భార్య, ఏమీ తెలియని భర్త' గురించి హాస్యం రాసాను.

'నా పెద్ద కూతురు నాటకం రాసింది రండ'ని క్లబ్బు ఫ్రెండ్స్‌ని వెంటబెట్టుకుని నాన్నగారు ఆ నాటకం చూడ్డానికి రావటం నాకెంతో ప్రోత్సాహాన్ని కలిగించింది. అంతేగాక సారస్వత నికేతన్ మేనేజర్ అడుసుమిల్లి శ్రీనివాసరావు గారు 'ఏమ్మా! చదువుకున్న ఆడపిల్లలు ఇట్లా అమర్యాదగా ప్రవర్తిస్తారని నువ్వు రాసావెందుకమ్మా?' అని ప్రశ్నంచటంతో రచనల గురించి, లక్ష్యం గురించి ఒక స్పష్టత తెలిసివచ్చిందప్పుడే!

## తొలి కథలు 'తెలుగు స్వతంత్ర'లో

ఇంటర్మీడియట్ చదివేటప్పుడు 'తెలుగు స్వతంత్ర'లో కొన్ని కథలు రాసి వుంటాను. నాయని కృష్ణకుమారి మా సీనియర్. విశ్వనాథ వారి వేయిపడగలు చదివాం. అందులోని కథానాయకుడు కిరీటిగారమ్మాయే కృష్ణకుమారి అని తెలిసే సరికి మాకా అమ్మాయి చాలా గొప్పగా కనబడేది.

ఇంటర్‌లోనే కట్నాల గురించి విమర్శిస్తూ తెలుగు స్వతంత్రలో 'కావాలి వరుల కేటలాగులు' అని కలంపేరుతో రాశాను. లేడీస్ హాస్టల్లోని వాళ్ళే ఇది రాశారని పక్కనే వున్న ఏసీ కాలేజి కుర్రాళ్ళు రాత్రిపూట మా హాస్టలుపైన రాళ్ళు కూడా వేశారు. తర్వాత మా వార్డెన్‌ను ఎగతాళి చేస్తూ వుడ్ హౌస్ స్టైల్లా కాలేజి మ్యాగజైన్లో ఒక ఆర్టికల్ రాశాను. దాంతో ఆమెకి నాపైన విపరీతమైన కోపం వచ్చేసింది కూడా!

## మొదటి షాక్

రాసిన కథలన్నీ నా జీవితంలోంచి వచ్చినవే అని అనుకోను. 1967 'భారతి'లో అచ్చయిన 'మచ్చలు' నా మొదటి కథగా నేను భావిస్తాను. నా భారమంతా వహించటానికి నాకో కుటుంబం ఉండేది. నా వరకు నాకు ఎట్లాంటి బాధ్యతలూ వుండేవి కావు. అట్లాంటి కాలంలో ఉన్నట్టుండి మా నాన్నగారు చనిపోయారు. అది నాకు జీవితంలో మొదటి షాక్. కాళ్లకింది భూమి కదిలి పోవటం అంటే ఏమిటో అప్పుడు అర్థం అయింది.

జీవితం అంటే ఏమిటి? మరణం అంటే ఏమిటి? అని అప్పుడు ఆలోచించాల్సి వచ్చింది. ఆ షాక్‌నుంచి తేరుకోవటానికి నాకు కొన్ని సంవత్సరాలు పట్టింది. ఆ తర్వాత నేను రాసిన 'మచ్చలు' కథ 'భారతి'లో ఫలానా తారీఖున అచ్చుకానుందని నాకో కార్డు వచ్చిన రోజు కాళ్ళు నేలమీద ఆనలేదు. అదో పెద్ద కిరీటం నాకు. అట్లా భారతిలో కథలు రాయడం ప్రారంభించాను. ప్రతి రెండు నెలలకో కథ రాసేదాన్ని. 1977లో 'గాలిరథం', 1982లో 'నీడలు' కథల సంపుటాలు తెచ్చాను.

## సాహిత్యం కుదిర్చిన సంబంధం

నేను ఎమ్మెస్సీ చదువుతున్నప్పుడు నాకు పెండ్లి చేసేయాలనుకున్నారు. మా మేనమామ ఒకరు అనంతపురంలో కలెక్టరు ఆఫీసులో ఉద్యోగం చేసేవాడు. అనంతపురం కాలేజీలో సుదర్శనం గారని మంచి లెక్చరర్ ఉన్నారని ఆయనకు తెలిసింది. బాగా చదువుకున్న, సాహిత్యం అంటే ఆసక్తి వున్న అమ్మాయిని చేసుకోవాలనుకున్నారట సుదర్శనం గారు. మా మామయ్య నేను కథలు రాస్తానని చెప్పగానే సరే చూస్తామని చెప్పి మా ఊరొచ్చి నన్ను చూసి సంబంధం ఖాయం చేసుకున్నారు. నాకే కొంత సందేహం ఉండేది. నాకేమో పెండ్లంటే కొంత భయం వుండేది.

## తర్వాత రచనా వ్యాసంగం...

అస్సలు కొనసాగనే లేదు. అసలు రాద్దామనుకోలేదు. రాయలేదు. అయితే చదివేదాన్ని. సుదర్శనంగారు బాగా రాస్తుండేవాళ్లు. నేను అన్నీ చదివేదాన్ని. ఫాలో అయ్యేదాన్ని. తరువాత తన రచనలకోసం కాదు, ఫిలాసఫీ, హిస్టరీ, రిలిజియన్స్ థియాలజీస్ అనేవి ఎక్కువగా వారు చదివేవారు. చివరి వరకూ కూడా సుదర్శనం గారు ఆ స్టడీని కొనసాగించారు. అది చాలా గొప్ప విషయం.

## మా వారు – నా రచనలు

'నీడలు' అనే కథా సంపుటాన్ని గురించి ఆయన రాశారు. 'అడవిపువ్వు' అనే కథని కన్నడ కథా సంకలనం కోసం వారు ఎంపిక చేశారు. నేనెప్పుడూ నా రచనల గురించి వారితో చెప్పేదాన్ని కాదు. ఎందుకంటే అంతా నా దగ్గర్నుంచే రావాలి. వస్తుంది. రాస్తాను. రాసిన తర్వాత ఆయన కొన్నిసార్లు చదివే అవకాశం ఉండేది. ప్రింట్ అయ్యాక అన్నీ చదివారు. 'చెరువు దగ్గర' కథ చదివాక 'లింగప్పకు ఎందుకంత ప్రాధాన్యత' అని ప్రశ్నించారు. నాకు ఏదైతే ఎక్కువ ఇష్టం ఉంటుందో వాళ్ళ భాష, వాళ్ళ ఆలోచనలు, వాళ్ళ జీవితమూ మూడూ ఒక చైన్‌లాగా కనపడుతాయి. అందువల్ల నేను అన్నీ కలిపి రాస్తాను. అందుకే లింగప్ప పాత్ర అట్లా వచ్చింది. లింగప్ప అట్లుంటాడు. సుదర్శనంగారికేమో భాష స్టాండర్డ్‌గా వుండాలి. నేను రాసేదేమో లింగప్ప జీవితంలోంచి వచ్చే భాష అంటాను.

### ఇష్టమైనవి

| | | |
|---|---|---|
| కథలు | : | చెహోవ్ కథలు |
| ప్రదేశాలు | : | కొండలు, నీళ్ళు |
| సినిమా | : | పాండవ వనవాసం |
| పాట | : | మౌనమే నీ భాష ఓ మూగ మనసా.. |
| గాయకుడు | : | మంగళంపల్లి బాలమురళీకృష్ణ |
| వంటలు | : | గారెలు, పరమాన్నం, పులిహోర |
| పుస్తకం | : | జీవితమే! |

ఏ విషయంలోనూ సుదర్శనంగారు వాదించరు. వారు చెప్పకపోయి వుంటే బహుశా అట్లాంటి పాత్రే వచ్చిండక పోవచ్చు.

మా నాన్న చిన్నప్పుడు నన్ను చాలా ప్రోత్సహించారు. వారి అంగీకారం నాకు కలిగించిన ఉత్సాహం చాలా ఎక్కువ. అట్లాంటి ప్రోత్సాహమే సుదర్శనం గారు కొనసాగించారు. కానీ ఎప్పుడూ ఆయన బయట పడలేదు. లోతైన పరిశీలనతో నా రచనల్ని పరిశీలించారు. తను చదివే గొప్ప పుస్తకాల్ని నన్నూ చదవమనేవారు.

## సుదర్శనంగారి పుస్తకాల్ని నేనే వేశాను

'మన పుస్తకాల్ని మనం వేసుకోవటం ఏమిటి' అనే సిద్ధాంతం వారిది. అయితే వారి పుస్తకాలన్నింటిని నేనే 'వసుంధరా పబ్లికేషన్స్' పేరుతో వేశాను. జీతం డబ్బుతో నెట్టుకొచ్చే ఆరోజుల్లో నేను పొదుపు చేసిన సొమ్ముతో పుస్తకాలు వేయటం జరిగింది. వారి పుస్తకాలన్నీ వరుసగా నేనే వేశాను. బుక్స్ ఫ్రేమ్ చేసింది మాత్రం సుదర్శనంగారే!

## అనుకున్నదే అయ్యింది

తంగిరాల సుబ్బారావు గారి కుటుంబం, మా కుటుంబం ఊటీలో గుంటూరు శేషేంద్రశర్మ, ఇందిరాదేవి గార్ల ఆహ్వానం మేరకు వారి బంగ్లాకు వేసవి విడిదికి వెళ్ళాం. అక్కడ ఇందిరాదేవి గారు మాట్లాడుతూ 'మీరు ఇన్ని కథలు రాశారు కదా పుస్తకం వెయ్యండి. ముందుమాట సుదర్శనం గారు రాస్తే సరి. లేదంటే ఎవర్నైనా మంచి స్టాండర్డ్ రైటర్ని అడగండి. పుస్తకానికి అవసరమయ్యే డబ్బు నేను ఇస్తాను' అంది.

ఆవిడ డబ్బు అయితే తీసుకోలేదు కానీ, అప్పటికి నా పుస్తకం వెయ్యమని ఎవరూ నాతో చెప్పి ఉండలేదు. కాబట్టి పుస్తకం వెయ్యాలనే ఆలోచన మాత్రం ఆమెదే!

అప్పట్లో నా కథల గురించి ఎవరేం మాట్లాడుకుంటున్నారనే ఫీడ్‌బ్యాక్ ఉండేది కాదు. ఎందుకంటే నేనెక్కడా బయట తిరిగేదాన్ని కాదు. అనంతపురంలో ఒక సమావేశానికి గజ్జెల మల్లారెడ్డిగారు వచ్చారు. వారు నన్ను చూడగానే చాలా అభిమానంగా పలకరించారు. 'బీనాదేవి పేరుతో బి. నర్సింగరావు రాస్తున్నట్టే ఎవరో పురుషుడు వసుంధర అనే స్త్రీ పేరుతో రాస్తున్నారని అనుకునేవాళ్లం. నిజంగా స్త్రీ ఈ విధంగా ఇంత ఆలోచించి కథ రాస్తారా అనుకున్నాం' అన్నారాయన.

సుదర్శనం గారిని ముందుమాట రాయమని ఎందుకులే అడగటం అని, మధురాంతకం రాజారాం గారిని అడుగుతూ ఉత్తరం రాశాను. మధురాంతకం రాజారాం గారు చాలా విశ్లేషణాత్మకంగా ప్రోత్సహిస్తూ ముందుమాట రాశారు. అదే 'గాలి రథం' కథల సంపుటం. అప్పటికే భారతి పత్రికలో నా కథలపై చాలా విలువైన అభిప్రాయాలు వచ్చాయి కనుక, అవార్డు వస్తుందని ముందుగానే ఊహించాను.

## రాయాలనిపిస్తే రాస్తాను!

బేసిక్‌గా నేను రైటర్‌నని అనుకోను. నేను జీవితంలో ఏం చూస్తున్నానో, దేనికి రెస్పాండ్ అవుతున్నానో అదే నేను. ఆ ప్రేరణ ఎక్కువయ్యి ఏమైనా రాయాలనిపిస్తే రాస్తాను. ప్రేరణ ఎట్లా వస్తుంది? మా నాన్నగారు చనిపోయారు కాబట్టి చావంటే ఏమిటి అనే ఆలోచన మొదలైంది. తర్వాత సమాజంలో అవినీతి, మిగతా అన్నీ కనిపించాయి. మా అమ్మ ఒక ఆస్పత్రిలో మరణించారు. అవన్నీ కథలుగా రాశాను. నాన్నగారు చనిపోయాక 'నీడలు' అనే కథ రాశాను. 1995లో అమ్మ చనిపోయాక 'అమ్మా.. ఇక సెలవు' కథ రాశాను. ఇప్పటికి అదే నా చివరి కథ. మొత్తం 48 కథలు, ఒక అనుబంధ నవల రాశాను. నా మొత్తం కథలన్నీ కలిపి 'ఆర్.వసుంధరాదేవి కథలు' సంపుటంగా 2004లో తీసుకు రావటం జరిగింది.

## అనువాదం అవసరం

మనం ఒక ఊపుమీద రాస్తాం. ఆ సమయంలో ఏం రాస్తామో మనకు తెలియదు. ఇప్పుడు ఇన్ని సంవత్సరాల తర్వాత నేను ఏం గమనిస్తున్నానంటే, నేను చెప్పాలనుకున్నది రీడర్స్ పూర్తిగా అందుకోలేక పోయారు. ఎందుకలా అంటే, కల్చరల్ గా వేవ్‌లెంగ్త్ సమానంగా ఉన్నవాళ్ళు లేరు అనుకుంటున్నాను. బహుశా కథల్లో నా వివరణ చిత్రణ కూడా పూర్తి కాక పోయి వుండవచ్చు. అందువలన నేను ఏం రాశానో తెలుసుకోవాల్సిన అవసరం వుందేమో అని నా కథల్ని చదవటం ప్రారంభించాను. ముప్పై ఏళ్ల కిత్రం ఆ కథలు రాసినప్పటి నా ఆలోచనలు భావాలు వేరు. ఇప్పటివి వేరు. మన ఆలోచనా విధానంలో పరిణితి క్రమంగా వస్తూ వుంటుంది. తనని గురించి తాను అవేర్ కావటం అనేది చాలా ముఖ్యం. కాబట్టి నేను నా కథల్ని ఇంగ్లీషులోకి అనువాదం చేస్తున్నాను. ప్రస్తుతం పది కథల్ని అనువదించాను.

## పిల్లలంతా అమెరికాలో..

మా ఇంట్లో నేనే పెద్దదాన్ని. నా మొదటి చెల్లెలు కమలాదేవి భర్త బాలయ్యది సినిమా రంగం. రెండవ చెల్లెలు ఇందిరాదేవి. వీళ్ళ కొడుకు హీరో బాలకృష్ణకు తోడల్లుడు. మూడవ చెల్లెలు సుశీలాదేవి. వీళ్ళ ఇంటాయన హీరో వెంకటేష్‌కు మేనమామ. నాలుగో చెల్లెలు హేమలతాదేవి పారిశ్రామికరంగం. ఇక మాకు ముగ్గురు పిల్లలు. పెద్దబ్బాయి శాంతిసాగరం సైకియాట్రిస్ట్, కోడలు ఉమాదేవి గైనకాలజిస్ట్. న్యూయార్క్‌లో ఉంటున్నారు. కూతురు అరుంధతి, అల్లుడు రమేష్ షికాగోలో ఉన్నారు. చిన్నకొడుకు, కోడలు కృష్ణచైతన్య, వేదవతి న్యూయార్క్‌లో ఉన్నారు.

**–పలమనేరు బాలాజి**

నాకు నచ్చిన నా కథ

# జాన్‌పాల్ చేసిన బీరువా కథ

- వసుంధరా దేవి

''టేపులో నీ పాట తీసేసి కొత్తపాట, జానీ మేరానామ్‌లోది, మంచిది పెట్టేశాడు అన్న...'' పాప చెప్పింది.
గబగబా ముందు హాల్లోకి వెళ్లాను. రేడియోలో వస్తున్న పాటని చాలా శ్రద్ధగా టేప్ రికార్డర్‌లో రికార్డు చేసుకుంటున్నాడు బాబు.
''ఎందుకని నా పాట తీసేశావ్?'' అనడిగాను.
''ఇష్'' అన్నాడు నావేపు చూడకుండానే.
రికార్డింగ్ అయ్యాక ''మంచిపాట నాశనం చేసేశావమ్మా, రికార్డు చేసుకుంటున్నప్పుడు మాట్లాడేశావ్'' అన్నాడు.
నా పాట పోగొట్టి ఇంకా పైగాను!
''అది పాతపాట. ఎవరిగ్గావాలి?'' అన్నాడు.
''నాకు కావాలి. అందుకేగదా రికార్డు చేసుకున్నాను. అది తిమ్యొద్దని చెప్పాను కదా!'' అన్నాను.

''అమ్మా అది రికార్డు చేసి సంవత్సరం అయింది. ఒక్కనాడు కూడా నీయంతట నీవు దాన్ని పెట్టుకొని వినలేదు. అది టేపులో వుంటే నీకేం, లేకుంటే నీకేం?.... మంచిపాట వస్తున్నది. తొందరలో దానిమీద పెట్టేశాను'' అన్నాడు. అంతటితో ఆ సంభాషణ అయిపోయిందని తాను కొత్తగా పెట్టుకున్న పాటలు వింటూ కూర్చున్నాడు.

ఆ పాట పోయింది. ఇహరాదు. వాదించి లాభమేమిటి?

నా పాట పోయినందుకు నాలో నిరాశ, ఏదో విలువైనది పోగొట్టుకున్నా నన్న బాధ. ఆ పాట ఉన్నా నేను పెట్టుకోను. ఎప్పుడైనా ఎవరైనా వరుసలో పెడితే వినడమే. అది ఎవరికీ అక్కర్లేని పాతపాట. నాకు కావలసిన పాట. కావలసినదైనా నేను పెట్టుకోని పాట. అది ఆ టేపుల్లో వుంటే నాకేదో తృప్తి. ఇప్పుడు అది పోయినందుకు బాధ.

ఎందుకో ఆ పాట నాకు కావాలి. నాకు ఇష్టమైందని కాదు. కాని నాకు కావలిసింది. ఎందుకో అర్థం కాకపోయినా నాకు చాలా ముఖ్యమైనది.

'ఆడేపాడే పసివాడ....' అది ఏ సినిమాలోదో, ఎవరు పాడినదో, దానిలోని భావమేమిటో నాకు గుర్తులేదు. నాకు అక్కర్లేదు. ఆ పాట వింటూంటే నాలో గొప్ప సంచలనం రేగుతుంది. ఉధృతంగా ఎగిరిపడుతున్న అలలతో, తుఫాను నాటి సముద్రం లాగా అయిపోతుంది మనసు.

.... ఎంతో ఆశించినదాన్ని పొందలేక విషాదభరితమైన జీవితంకల ఒక అమ్మాయి ఆనందానికి ప్రతిరూపంగా కనిపించిన పసివాణ్ణి చూచి, ఎంతో ఆనందంతో పాడుతుంది ఆ పాట. పాట అయిపోయేసరికి పిల్లవాడు దుర్మరణం పాలౌతాడు. మళ్లీ కటిక చీకటిలాంటి విషాదం ఆవరిస్తుంది.

ఆనందానికీ విషాదానికీ గల సరిహద్దులో, రెండూ ఒకటయ్యేచోట ఆ పాట. పాట వింటూంటే ఆనందమూ, దాని వెనుకనే పొంచివున్న విషాదమూ రెండూ ఒక్కసారిగా తీవ్రమౌతాయి. ఊపిరి సలుపనివ్వకుండా పెరిగి పెరిగి... ఉక్కిరి బిక్కిరై నలిగిపోతుంది గుండె.

ఆ పాత పాట నాకు యిష్టమని కాదు. నేను నా అంతట ఎప్పుడూ దాన్ని పెట్టుకోను. కాని నాలోనే అందరాని లోతుల్లో ఉండే సత్యానికి ప్రతినిధిగా అది అక్కడ ఉండటం చాలా ముఖ్యం....

మనిషి మనసు చిత్రమైనది. ఆ పాట అక్కడే ఉన్నన్నాళ్ళూ నేను దాని గురించి తలచ లేదు. కాని అది చెరిగిపోయేసరికి దాని గురించి యింతగా ఆలోచించుకున్నాను. అది మాటల్లేని మూగరాగమై నాలో నిలిచిపోయింది....

ఇంట్లో ఇంకో బీరువా ఉంటే నాకు ముఖ్యమైనవి పిల్లలచేతుల్లో పడకుండా భద్రంగా దాచుకోవచ్చును. కావలసినవి జారిపోకుండా, మాసిపోకుండా, చెరిగిపోకుండా, పోకుండా దాచుకోగలను.

ఈ యింట్లో నాకు ఓ బీరువా చాలా అవసరం!

***

'జాన్‌పాల్ బలే టక్కరివాడమ్మా'

మా యింట్లో పనులు చేసి వెళ్తుండే పనివాళ్లు ముగ్గురూ ఒక్కరకంగానే చెప్పారు జాన్ గురించి. ఆ విషయం నాకూ కొంచెం అనుభవమే. కాని 'తెలియని దేవతకన్నా తెలిసిన దయ్యం మేలు' అన్న సామెత ననుసరించి నడుస్తుంది నా బుద్ధి.

బీరువాను రెడీమేడ్‌గా కొనాలంటే పాతిక మైళ్ళవతల ఉన్న పట్నం వెళ్లి కావలసిన సైజులో ఆర్డరిచ్చి రావాలి. షాపువాళ్లు యిప్పుడిస్తాం, అప్పుడిస్తాం అంటుంటే అక్కడకు నాలుగుసార్లు వెళ్ళాలి. తర్వాత జాగ్రత్తగా పాక్ చేయించి దెబ్బతగలకుండా బస్సు మీదనో లారీ మీదనో తీసుకురావాలి. ఇంతా చేశాక వాళ్లు రెండోరకం కొయ్యవేసి పైన చక్కగా పాలిష్‌చేసి, ఘనంగా వార్నిష్ చేసి మసిపూసి చేసిన మారేడుకాయలాంటిది అంటగడితే ఎలాగా? చెక్క క్వాలిటీ మనం సరిగ్గా కనుక్కోగలమా?

అద్దంలా మెరిసే అందమైన బీరువా కావాలి. కాని దానికోసం ఎక్కువ యాతన పడడానికీ ఓపికలేదు.

అటువంటి సమయంలో జ్ఞాపకం వచ్చాడు జాన్‌పాల్.

ఇదివరలో ఒకసారి పుస్తకాల షెల్ఫులు తయారుచెయ్యడానికి ఒచ్చిన ప్పుడు ఎన్నాళ్ళ బట్టో మా యింట్లో వుంటున్న బుక్ కేస్‌ను చూసి 'ఇది ఇంగ్లం డులో దొరికే, పియానోలు చేసే వాల్‌నట్ కొయ్యతో చేసింది.. అమ్మో ఇదిక్కడ దొరికేది గాదు... అమ్మా ఇది ఫారిన్ చెక్క!' అన్నాడు. ఆ మాటలంటుంటే జాన్ మొహంలో కనిపించిన గాంభీర్యాన్ని, గౌరవభావాన్ని చూచి ఆ బుక్‌కేస్ గొప్ప దనాన్ని ఊహించుకున్నాను. అల్లాగే ఒక పాత బీరువాను చూడగానే 'ఇది బర్మా టేకులో ఒకటోరకం' అని చెబుతూ టేకుల్లో ఎన్ని రకాలో, వాటి చరిత్రల గురించి ఒక ఉపన్యాసం లాంటిది ఇచ్చాడు. కొయ్యల్లో ఇన్ని రకాలున్నాయని నాకు ఇది వరకు తెలియదు. జాన్‌మీద చాలా గౌరవం కలిగింది నాకు. అద్దంలా మెరిసే అందమైన బీరువాను ఒకటోరకం టేకుతో తయారు చెయ్యగల సామర్థ్యం జాన్‌కి ఉన్నది అనుకున్నాను.

కాని ఈ జాన్‌తో ఇతర విధాలైన చిక్కులు వస్తాయి. ఇదివరలో బుక్‌రాక్‌లు చేసినప్పుడు పట్నం వెళ్ళి సామాన్లు తెస్తానని కొయ్యలూ మేకులూ అంటూ రెట్టింపుధరలు వేసిన దొంగ బిల్లులు తెచ్చి డబ్బు తీసుకున్నాడు. అవి ప్లైవుడ్ షీట్లు కనుక, వాటి ధరలు వేరుగా కనుక్కోగా, మోసం బయట పడింది. జాన్ అప్పటికే డబ్బు తీసుకున్నాడు. మళ్ళీ పిలిపించి అడిగాము. కొట్లవాళ్ళ మోసా లను గురించి చిన్న ఉపన్యాసం చాలా 'ఇన్ఫర్మేటివ్'గా ఉండేది ఒకటి ఇచ్చాడు. వడ్రంగి పనికి సంబం ధించిన ఏ విషయం మీద మాట్లాడవలసి వచ్చినా ఇటువంటి మంచి ఉపన్యాసాలు ఇస్తాడు. అవి విన్న తర్వాత జాన్‌మీదా, వడ్రంగి పని మీదా కలిగిన గౌరవభా వంతో నోరు మెదపలేము.

పల్లెటూళ్ళలో ఏ పని జరగా లన్నా ఒక భగీరథ ప్రయత్నం కావాలి. ఒక ఇల్లు కట్టించు కోవా లంటే బేలుదారీలు, వడ్రంగులు, పెయింట్లు వేసే వాళ్ళు అంటూ అన్ని రకాలైన పని వాళ్ళకీ పనులు జరుగుతు న్నంత కాలమూ ఇంట్లోనే భోజనాలు పెట్టాలి. కరెంటు వేయిం చుకోవాలంటే వైరింగు చేసేవాళ్లకూ అంతే. ఏదైనా వస్తువు చేయించాలంటే వడ్రంగులకూ అంతే. ఆఖరుకు బట్టలు కుట్టే టైలర్లకు కూడా అంతే. వాళ్ళ భోజనాలకు గడిచి పోగా, పనిచేసినన్ని రోజు లకు కూలి డబ్బులు చేతబ ట్టుకొని ఇళ్ళకు వెళ్తారు. వాళ్ళు పనిని సాగదీసి, ఇంకో వారం రోజులు గడిపే తత్త్వంలో ఉంటారు. మన పనిచేసే వాళ్ళు మనింట్లో భోజనం చెయ్యడం, తృప్తిగా పని చెయ్యడం న్యాయమే కావ చ్చును. కాని ఏ పని జరగాలన్నా ఇంత ప్రయత్నం కావలసి రావడం పట్నాల నుండి వచ్చిన వాళ్ళకు విసుగ్గా ఉంటుంది. డబ్బు పారేస్తే పని జరగటం, వస్తువు ఇంటికి రావడం అన్న పద్ధతి కాదు ఇక్కడ. ఇది ఒక పాతపద్ధతి. వస్తు వుకీ, అది చేసే వాడి మంచిచెడ్డలకీ గల అవినాభావ సంబంధాన్ని గుర్తించి తీరాలి.

మా వారు ఇక్కడ కొత్తగా పెట్టిన చక్కెరమిల్లులో అసిస్టెంట్ మేనేజర్‌గా చేరారు. అందువలన ఈ పల్లెటూరికి వొచ్చాం మేము. ఊళ్ళో మరో ముగ్గురు వడ్రంగులు ఉన్నారు. కాని అందరిలోకీ జాన్‌కే పని బాగా చేతనవునని... జాన్, ఇతరులూ కూడా చెపుతూ వుంటారు. మిల్లులో ఏవైనా కొయ్యపనులు జరగా ల్సినప్పుడు జాన్‌ని పిలుస్తారు. ఇది ఒకరకంగా జాన్‌కి సహాయం చెయ్యడమే. ఆ సంబంధం వలన ఇదివరలో ఒకసారి వచ్చి బుక్‌రాక్‌లు చేశాడు.

"అమ్మో, అయ్యగారింట్లో భోజనం పెట్టమని నేనడుగుతానా! ఊళ్ళో నాకు ఇల్లుంది. వంట చేసుకుం టాను... కూలి కూడా అయ్య



గారి దగ్గర ఒక్క రూపాయి తక్కువే తీసుకుంటాను'' అన్నాడు జాన్. పెద్దా చిన్నా బాగా ఎరిగినవాడు. పెద్దవాళ్ళ దగ్గర వినయంగా ఉండటం నేర్చిన వాడు. కొయ్యలూ వగైరాలు తేవడంలోనూ, కూలిలోను కూడా ఎక్కువ డబ్బు తీసుకున్నాడంటే అది వేరే మాట. వాళ్ళూ బతకాలిగద....

అన్ని విషయలూ ఆలోచించినమీదట జాన్‌పాల్‌కు కబురు పెట్టాను. మిల్లులో పనులు చేస్తూనే ఉంటాడు అడపాదడపా. కనుక మనల్ని చిక్కున పెట్టడు లెమ్మనుకున్నాను.

పొట్టిగా దిట్టంగా చామన నలుపులో ఉంటాడు జాన్. అరవై దగ్గరగా వయస్సయినా నలభైకి మించినట్లు కనబడడు. మొహం, ఎదుర్రొమ్ము, చేతులూ, కాళ్ళూ అన్నీ వేటికవి బలంగా దృఢంగా కనిపిస్తాయి. పై వరుసలో ముందు పళ్ళు రెండు లేవుగాని మిగతా పళ్ళు రాళ్ళమాదిరి గట్టిగా ఉన్నాయి. ఎత్తయిన నుదిటిక్రింద లోతుల్లో కనిపించే కళ్ళ నల్లగా ఉండి ఎప్పుడూ చురుగ్గా చూస్తుంటాయి. రూపం, మాటతీరు అన్నీ ప్రత్యేకంగా ఉండటాన జాన్‌ని ఒకసారిచూస్తే ఎవరూ మరచిపోలేరు. జాన్‌ని గురించి ఒక్క మాటలో చెప్పాలంటే.... బలశాలి. మాటలో. చేతలో, చూపులో అన్నిట్లోనూ బలం. అదీ జాన్ అంటే!

నిజం చెప్పాలంటే జాన్‌ను చూస్తే కొద్దిగా భయం నాకు. దుర్బలులకు శక్తిని చూసినప్పుడు కలిగే భయం. స్థూలంగా చూస్తే దానికి వేరే కారణం లేదు మరి!

చకచకా లెక్కలు వేశాడు జాన్. అంతా ఒక వంద రూపాయలకు సామాను తెస్తే టేకు బీరువా యీ సైజుది తయారు చెయ్యచ్చునట. పట్నంలో షాపు నుంచీ రోజ్‌వుడ్ బీరువా యీ సైజుది నాలుగువందలకు తెచ్చారు పక్కింటి వాళ్ళు. అట్లాగని జాన్‌తో నేను అనలేదు. 'రోజ్‌వుడ్ అయితే ఎక్కువ ఖరీదవు తుందా?' అనడిగాను. లేదు, రెండూ ఒకటేనన్నాడు. తక్కువ రకం సరకు తెస్తాడేమో, లేకుంటే ఇంత చవగ్గా ఎలా వొస్తుందీ అనుకున్నాను. మంచిరకం టేకు తేవాలన్నాను. 'అయ్యగారికి ఎట్లాంటివి తేవాలో నాకు తెలియదా? అంటూ తాను పట్నంలో పెద్దపెద్ద ఆఫీసర్లకు ఎన్నెన్ని వస్తువులు చేసిందీ, వాటిని చూచి వాళ్ళు ఎంతెంత ఆశ్చర్యపడిందీ, మెచ్చుకున్నదీ అంతా చెప్పాడు.

జాన్‌క్రిష్టియన్ మిషనరీల దగ్గర పెరిగాడు. పని నేర్చుకున్నాడు. ఒక ఇంగ్లీష్ దొర గారు... పీటర్స్ దొరగారు... దయతో అన్నిపనులూ నేర్పించారు జాన్‌కు. ఎంతో సహాయం చేశారు. ఆయన దయవల్ల ఎట్లాంటి వస్తువైనా చెయ్యగల నేర్పు అబ్బింది జాన్‌కు.

'ఒరే, ముండాకొడకా, సరిగ్గా చెయ్యకపోతే తంతాను' అన్నాట్ట కలెక్టరు గారు. ధైర్యంగా చేస్తానన్నాడు జాన్. పెద్దవాళ్ళను మెప్పించాలని జాన్ పట్టుదల. రోల్‌టాప్‌డెస్కు చెయ్యాలి. ఆ పట్నంలో ఎవరికీ చేతగాని పని అది. అలాటిదాన్ని ఇదివరలో పీటర్స్ దొరగారి దగ్గర చూచివున్నాడు జాన్. అందుకే ధైర్యం చేసి ఒప్పుకున్నాడు. చేశాడు కలెక్టరుగారు 'సెభాష్' అన్నారు.

ఇంకోసారి ఒక పెద్ద డాక్టరుగారికి ఆసుపత్రిలో ఉపయోగించే ఒక వస్తువు చేయించ వలసిన పనిబడింది. ఆ వస్తువును పై దేశాల్నుంచీ తెప్పించాలంటే చాలా ఆలస్యమూ, ఖర్చూను. అందువలన జాన్‌ను పిలిపించి చెప్పారు. జాన్ ఆలోచన చేశాడు. ఒక రకంగా ఊహించుకున్నాడు దాన్ని. చేశాడు. తప్పు అయ్యింది. పారేశాడు. మళ్లీ చేశాడు. డాక్టరు గారు సరిగ్గానే ఉందన్నారు. ఇహ ఒక అద్దం బిగించాలి దానికి. అది ఎట్లా బిగించాలో చెప్పారు డాక్టరు గారు. కాని తాను దగ్గర ఉన్నప్పుడే బిగించాలనీ తొందరగా వొస్తాననీ చెప్పివెళ్లారు. ఎంతసేపు చూచినా ఆయన రాలేదు. పని పూర్తి చేసుకుని డబ్బు తీసుకుని వెళ్ళాలని జాన్ ఆదుర్దా. డాక్టరు గారు చెప్పిన ప్రకారం గానే ఆయన రాకుండానే బిగించేశాడు. డాక్టరు గారు ఇంటికొచ్చారు. పనయి పోయింది, డబ్బులివ్వమని చెప్పుకున్నాడు జాన్. డాక్టరు గారికి కోపం మండిపోయింది. 'నిన్నెవరు బిగించమన్నారురా రాస్కెల్! నేను రాకుండా బిగించవద్దనలేదా?' అంటూ చెయ్యిచాచి మొహం మీద కొట్టారు. ముందు పళ్ళు రెండూ రాలిపడ్డాయి. జాన్ బయటికెళ్ళి రక్తం పూసి వచ్చాడు. డాక్టరు గారు వస్తువు చూసుకున్నారు. సరిగ్గానే చేశాడు జాన్. డబ్బులిచ్చి పంపేశారు. ఇప్పుడా డాక్టరు గారు పనిలో లేరు. ఎప్పుడైనా పట్నం వెళ్ళినప్పుడు కనబడితే అప్పుడు కొట్టిన విషయం జ్ఞాపకం చేస్తూ పలకరిస్తారు. ఈ తీరులో జాన్ సొంతంగా ఊహతో కొత్తరకం వస్తువులు తయారుచేసి పెద్దలను మెప్పించిన వృత్తాంతాలు చెప్పాడు. జాన్‌ను పెద్ద వాళ్లు కొట్టడంలోనూ మెచ్చుకోవడంలోనూ కూడా కుక్కను చూచినట్లు చూడటం నాకు నచ్చలేదు. కాని మా బీరువా చెయ్యడానికి తగిన వాడని తెలిసిపోయింది.



ఆయన ఆఫీసునుండి రాగానే బీరువా చేయించడానికి జాన్‌ను పిలిపించానని చెప్పాను. జాన్ ఆయనకు వివరాలన్నీ చెప్పాడు. ఒకటో రకం టేకు బీరువాకు... ముందుగా కొయ్యలు నూటయాభై రూపాయిలకి తేవాలి. కూలి డబ్బుల మాట జాన్ అడగడు. అయ్యగారి ఇష్టం. పది రూపాయలిస్తే పదే తీసుకుంటాడు.

''ఇందాక కొయ్యలు నూరు రూపాయిలకు చాలన్నావే'' అన్నాను. 'అయ్యగారి దగ్గర కరెక్టుగా చెప్పాలి కదమ్మా. తర్వాత పొరపాటు రాకూడదు. పెద్ద దొరలదగ్గర ఎట్లా ఉండాలి?' అంటూ నన్ను మందలించాడు. అదీ నిజమే. ఇప్పటి లెక్కల్ని బట్టి బీరువా ధర నూరు దగ్గర కాకుండా రెండునూర్లు అయేట్లుంది. కాని మంచి చెక్క చూసి తెచ్చి జాగ్రత్తగా ఇంట్లో చేస్తాడు. ఎట్లయినా షాపువాళ్ళ దగ్గర కొన్నదానికంటే ధర తక్కువే పడుతున్నది గదా!

నూట తొంభై రూపాయలకు బిల్లుతో కొయ్యలు తెచ్చి కట్ట యింట్లో పడేశాడు జాన్. తర్వాత నాలుగురోజులు అంతులేదు. 'ఇంతకూ పని చేస్తాడో లేదో, వూరికే కొయ్యలు తెచ్చి ఇంట్లో పెట్టుకున్నామే' అనిపిం

చింది. మా పనివాడు కొయ్యల్ని చూచి 'కొయ్య ముళ్ళుగా వున్నది. అంత మంచి గాలేదు' అన్నాడు. ఇంతా చేసి నిగనిగ మెరిసే అందమైన బీరువా రాదా ఏమిటి? నాకు చాలా కోపం వచ్చింది. ఈయనేమో ఏ సంగతీ పట్టించుకోరు!

నాలుగుసార్లు పిలిపించగా జాన్ వచ్చాడు. 'అమ్మా ఫర్నీచరు షాపుల వాళ్లు ఎక్కువగా కొంటారు గనుక వాళ్ళని మంచి కొయ్యలు ఏరుకోనిస్తారు గాని నాబోటి వాళ్లు ఒక్క బీరువాకు కొంటే ఏరుకోనివ్వరు. చెయ్యి పెట్టని వ్వరు. అయినా యివి దొరగారికోసమని చెప్పి బలవంతాన రెండు మూడు మంచి కొయ్యలు ఏరివేశాను... ఆ ముళ్లు అవీ తోపడంలో పోతై. కనపడవు. బాగానే వుంటుందిలెండి బీరువా' అన్నాడు. 'పని చెయ్యడం లేదు. ఎందువలన' అనడిగాను.

'కొయ్యలన్నీ మా ఇంటికే తీసుకెళ్లి చేస్తానంటే దొరగారు 'ఒద్దు యింట్లోనే చెయ్యి' అన్నారు. నేను పక్క వూళ్లో హోటలుకు బల్లలు చేస్తున్నాను. ఇక్కడ పని చేస్తూ నడి మధ్యలో వొదిలి అక్కడకు పోతే... దొరగారి పని అట్లా చెయ్య కూడదు! పనిలో దిగితే పూర్తి చెయ్యాల్సిందే. అందుకని ఆ పని పూర్తిచేసి వొద్దామని ఆలస్యం చేస్తున్నాను. మూడు నాలుగు రోజుల్లో వొచ్చి చేసెయ్యనా. అమ్మా!.... దొరగారి పనంటే మాటలా!' అన్నాడు.

పదిహేను రోజుల తర్వాత వొచ్చాడు పనికి. ఆయన బాగా చీవాట్లు వేశారు. ఒంచిన తల ఎత్తలేదు జాన్. 'అవును తప్పుచేశాను. పెద్దవాళ్లు.... తిడితే పడాలి' అన్నాడు నాతో తర్వాత. ఒక్కరోజు పని చేసి మళ్ళీ మాయమై పోయాడు. ఊళ్ళోనే ఎక్కడో దూలాలు కోస్తున్నాడంట. రెండురోజుల తర్వాత వచ్చాడు. 'వాళ్లు నాకు ఇదివరలో డబ్బు ఇచ్చి వున్నారమ్మా. పీకల మీద కూచుంటే వెళ్ళవలసి వచ్చింది. అందులోనూ పెద్దవాళ్ళ పని అని చెప్తే గూడా వాళ్లు ఊరుకుంటేనా' అన్నాడు.

'అసలు వాడు పనిచేసే చోటునుంచీ కొయ్యలు చల్లగా దాటించేస్తాడమ్మా. జాగర్తగా ఉండాలి' అని హెచ్చరించాడు మా శ్రీరాములు. ఒకే ఊళ్ళోవాళ్ళకు.... పల్లెటూళ్ళలో... ఒకరిగురించి ఒకరికి బాగా తెలిసి వుంటుంది. లేనిపోని తంటా కొని తెచ్చుకున్నట్టని పించింది. పనిచేస్తూ వున్నప్పుడు గంటకో సారి బయటకు వెళ్తాడు జాన్.... బీడీలు కాల్చుకోడానికి, టీ తాగటానికి, ఎవరితోనైనా మాట్లాడ్డానికి, సామాన్లు ఎవరి దగ్గర్నుండో తెచ్చుకోడానికి... ఎన్నో పనులు. ఇందులో ఏ సమయంలో దాటించేస్తాడో! అసలు తాను తీసుకెళ్లడానికి సగం కొయ్యలు వేరుగా ఎక్కువగా తెచ్చాడేమో! మొదట చెప్పిన దానికంటే ఎక్కువ బిల్లు చేసుకొచ్చాడే! జాన్‌కోసం మనుషులు వొచ్చి పోతుంటారు కూడాను. ఎవరికిచ్చి పంపించేస్తాడో! ఎన్నో అనుమానాలు. అందుకని జాన్ దగ్గర ఒక మనిషి కాపలా ఉండవలసి వచ్చింది. శ్రీరాములికి ఇతరపనులు చెప్పకుండా, మా ఇద్దరిలో ఒకరు తప్పిస్తే ఒకరు అక్కడ ఉండ వలసి వచ్చింది.

శ్రీరాముల్ని చూస్తే జాన్‌కు చాలా లోకువ. 'ఏయ్ అబ్బాయ్, ఆ ఉలి ఇట్లా అందించు, ఈ బల్ల పట్టుకో... ఊ సరిగ్గా పట్టుకోవయ్యా... ఏ పనీ సరిగా చెయ్యలేవు' అంటూ శ్రీరాములుకు ఏదో ఒక పనిని చెప్తూ గదమాయిస్తూనే వున్నాడు.

చీటికిమాటికీ జాన్ బయటికి వెళ్తూండడం వలన పని వెనుకబడుతున్నది. టీ కోసరం వెళ్తే గంటన్నర వెళ్లిపోతాడు. మొదటిరోజు సాయంత్రం మాతో పాటుగా టిఫిన్, టీ ఇచ్చాను. బయటకు వెళ్లకుండా ఇంకోగంట కూర్చుని పని చేశాడు. మర్నాడు ఉదయం పనిలోకి రాకుండా మధ్యాహ్నం మూడు గంటలకు వచ్చాడు. ఇప్పుడే కదా పనిలోకి వచ్చాడు. టిఫినూ టీలు ఇచ్చి ఎదురు సేవలు చెయ్యాలా? అనుకొని ఇవ్వలేదు. అయిదు గంటలయ్యే సరికి కొయ్యలు, పనిముట్లు దభీదభీమని ఎత్తి పడెయ్యడం మొదలెట్టాడు. ఆ శబ్దాలు వినలేక అప్పటికప్పుడు టీ చేసి ఇచ్చాను. గ్లాసు చేతిలోకి తీసుకుంటూ నా కళ్లలోకి తీక్షణంగా చూశాడు.

'రెండుపూటలా అన్నం పెట్టి, కాఫీ టిఫినూ యిస్తామని ఎందరో పిలుస్తారమ్మా! దొరగారి పని అని వచ్చాను' అన్నాడు. ఆ చూపుకి నా గుండెలో దడ



# నేను దగ్గరగా పరిశీలించిన జీవితం



ఇష్టం అంటే ఏమిటి? ఈ జీవితాన్ని ఎట్లా చూస్తామో అదే కథ. బియాండ్ టచ్ ఉన్నప్పుడే కథ వస్తుంది. అన్ని కథలూ జీవితం లోంచి వచ్చినవే! అందులో ఒకటి 'జాన్‌పాల్ చేసిన బీరువా' కథ. ఇందులో జాన్‌పాల్‌ను నేను దగ్గరగా పరిశీలించాను.

**-ఆర్.వసుంధరాదేవి**

**9014226763**

వచ్చింది. మర్నాటి నుండి నాలుగ్గంటలకు సరిగ్గా టిఫిన్ టీలు ఇచ్చెయ్యాలనుకున్నాను. ఈ జాన్ పైకి కనిపించేటంత వినయ విధేయతలు కలవాడుగా తోచలేదు. మాటల్లో కనిపించే విధేయతకు పూర్తిగా వ్యతిరేకమైన స్వభావం కలవాడుగా చేతల్నిబట్టి తోస్తున్నది.

జాన్‌కి ఒక కొడుకూ, ఒక కూతురూనట. కూతురు చదువుకొని పట్నంలో టీచరుగా ఉంటున్నది. జాన్ సరిగా చూడడు గనక జాన్ భార్య కూడా పట్నంలో కూతురి దగ్గరే ఉంటున్నది. ఇదివరలో జాన్ సంపాదించినంతా తాగేసి ఇంట్లో డబ్బు సరిగ్గా ఇచ్చే వాడు కాదట. ఏమని అడిగితే భార్యను బాగా తన్ని 'ఆడముండవి, నోరుమూసుకుని పడివుండు' అనేవాడట. ఆవిడే కష్టపడి కూతుర్ని చదివించుకున్నది. జాన్‌మాత్రం కొడుకు ఫిలిప్‌తో యీ వూళ్లో వుంటున్నాడు.

ఇదివరలో రాక్‌లు చేసేప్పుడు ఒకనాడు ఫిలిప్‌ను వెంటబెట్టుకుని వచ్చాడు జాన్. వాడు కష్టపడలేనివాడు గనుక మిల్లులో ఏదైనా ఆఫీసు జవానులాంటి పని ఇప్పించమని అడిగాడు. ఫిలిప్‌కు ఇరవై ఏళ్ళ పైన వయస్సుంటుంది. సెకండ్ ఫారమ్ చదువుతూ ఆపేశాడట.

'అమ్మో వాడు చాలా తెలివికలవాడు. పంతులు క్లాసులో ఏదో అన్నాడని పంతం మీద మానేశాడు గాని చదివుంటేనా, వాడు... అమ్మా... ఎట్లుండవలసిన వాడు ఎప్పుడైనా సమయం పడినప్పుడు నేను పనిలోకి రాలేకపోతే, వాడు వెళ్లి నాకంటే బాగా చేస్తాడమ్మా పని!..... అయితే ఎంతటి వాళ్లయినా మాటంటే మాత్రం పడడు' అన్నాడు జాన్.

ఫిలిప్‌ది తండ్రికిలాగే దృఢమైన శరీరం. నల్లగా నేరేడు పండులాగా నిగనిగలాడు తుంటాడు. కాని జాన్ మొహంలోనూ ఆకారంలోనూ కనిపించే గట్టిదనం ఫిలిప్‌లో కనిపించదు. మొహమూ చెంపలూ చేతులూ ఆడపిల్లలకున్నట్లు మృదువుగా వుంటాయి. వాడి ఇరవైఏళ్ళ కళ్ళల్లో సోమరితనం, అలసత్వం కనిపిస్తాయి. జీవితంతో పోరాడి ఎన్నో ఢక్కామొక్కీలు తిని రాటుదేలిన జాన్ కళ్ళు... అరవై ఏళ్ళవి.... వాడి చూపుతో వెలుగుతూ వుంటాయి. ఇద్దరూ తండ్రీ కొడుకులు. ఒక రకంగా ఇద్దరికీ చాలా పోలికలున్నాయి. కాని అంతకంటే ఎక్కువ భేదమూ వున్నది.

జాన్ కొడుక్కి ఉద్యోగం కావాలని అడుగుతూవుంటే ఆ విషయంతో తనకు ఏమీ సంబంధం లేనట్లు రెండు చేతులూ కట్టుకుని ఏటోచూస్తూ ఒంటి కాలి మీద నిలబడ్డాడు ఫిలిప్. వాడు ఉద్యోగం అర్థిస్తున్న వాడిలా కనబడలేదు. జాన్ పని చేసుకుంటుంటే అట్లాగే నిలబడి కొంచెం సేపు చూసి 'నేనింటికెళ్తా, నాయనా' అన్నాడు. జాన్ పని ఆపి, ప్రేమగా కొడుకు వైపు చూసి 'వెళ్ళు' అన్నాడు. ఫిలిఫ్ వెళ్లిపోయాడు. పని కోసరం వాళ్ళు మళ్ళీ అడగలేదు. 'వాడు పనిచేస్తే జాన్‌కి ఇంకేమి! వాడు సోమరి, ఇదివరలో వాళ్ళనీ వీళ్ళనీ అడిగి రెండుసార్లు పనిలోపెడితే ఉండకుండా వచ్చేసినాడు. పనిలోకి రాబోయే ముందు జాన్ వంట చేసివస్తాడు. వాడు చెయ్యడు' అని చెప్పాడు శ్రీరాములు.

జాన్‌కి ఫిలిప్‌కి ఉండే సంబంధం నాకు ఆశ్చర్యం కలిగించింది. భార్యనీ, కూతుర్నీ అంత కరుగ్గా చూసే జాన్ ఫిలిప్‌ని అంతప్రేమగా చూస్తాడెందుకు? వాడు శుద్ధ అప్రయోజకుడై నాడు. జాన్ వాడినట్లా చేశాడనడమే సబబేమో. పంతులు ఒక మాటంటే వాడు చదువు మానేస్తానంటే మానెయ్యనివ్వడమేనా? దండించి చదివించు కోరా! పోనీ చదువు అబ్బకపోతే తన పని నేర్పించితే ఒకరి సంపాదన కొకరిది తోడుగా ఇబ్బడిగా సంపాదించుకోవచ్చునే! జాన్ ప్రవర్తన చాలా చిత్రంగా ఉన్నది. తాను ఎన్నో అబద్ధాలాడి నానాగడ్డీ కరచి నెట్టుకొస్తున్నాడు. కొడుకు మాత్రం ఒకరిచేత మాటపడని వాడుగా, కష్టపడ లేనివాడుగా అబద్ధమూ అన్యాయమూ లేకుండా డబ్బంటే లెక్క లేకుండా ఉండాలా!

ఒకరోజు వొచ్చీ ఒకరోజు రాకా పనిచేసి, చేసి ఎట్లాగో బీరువా పని ఒక కొలిక్కి తెచ్చాడు జాన్. ఇహ అరలుపెట్టి తలుపులు బిగించాలి. అటువంటి సమయంలో మళ్ళీ మాయమైనాడు. ఆ ముందురోజునే పట్నం వెళ్లి సీలలు, బందులు, హాండిలు, తాళం, పాలిషు, ఎమెరీపేపర్లు అన్నీ బస్సు చార్జీలతో సహా యాభై రూపాయల సామాన్లు తెచ్చాడు. ఇంకొక్క రోజు పనిచేస్తే పూర్తవుతుందన్నాడు. ఇంతరవకూ పనిచేసిన దానికి తనకు రావలసిన కూలిలో పది రూపాయలు మిగిలి వుంటే తీసేసుకున్నాడు. అంతే పనికిరాలేదు. ఎక్కడికైనా పారిపోయాడా అనుకోవడానికి జాన్ సామాన్లు – ఉలి, రంపం, క్లాంపు అన్నీ మా ఇంట్లోనే వున్నాయి. ఎన్నిసార్లు వెళ్ళినా మా మనుష్యులకు జాన్ అంతుదొరకలేదు. మూడోనాడు శ్రీరాములికి బజార్లో కనబడ్డాడట. బాగా తాగి వుండి శ్రీరాముల్ని నానా దుర్భాషలాడాట్ట. ఫిలిప్ సర్దిచెప్పి మర్నాడు పనిలోకి పంపు తానన్నాట్ట.

ఎన్నో క్షమార్పణలతో మర్నాడు పనిలోకి వచ్చాడు. ఎక్కడో పని ఒప్పుకున్నాడట. రేపటితో యీ పని పూర్తి చేసుకుని వెళ్లిపోతాడట. ఇక్కడ పని సరిగా చెయ్యకుండా, మాట నిలకడలేకుండా చేసుకున్నందుకు కొడుకు బాగా కోప్పడ్డాడట. మొదట ఇచ్చిన ఎస్టిమేటుకి అయిన ఖర్చుకీ సంబంధం లేకుండా ఉన్నదనీ, పని తొందరగా చెయ్యలేదనీ జాన్‌ను కోప్పడి ఆయన ఫాక్టరీకి వెళ్ళిపోయారు. తరువాత నా దగ్గర మామూలుగా కనిపించే అతిశయంగానీ అతి వినయంగానీ లేకుండా మాట్లాడాడు. 'నూట యాభై రూపాయలకు బీరువా చేసిస్తానని చెప్పాను. నిజమే. అంతా అయ్యేటప్పటికి రెండు వందల యాభై దాటి పోతున్నది. ఇందాక అయ్యగారు తిట్టారు... నాకూ అదే చాలా చింతగా ఉన్నది. ఇంట్లో గూడా చింతపడతా ఉంటే నా కొడుకేమన్నాడంటే.

'మాట పొరపాటు రాకూడదు నాయనా, అయ్యగారు డబ్బు జాస్తి అవుతుందని కోప్పడితే నువ్వు కూలి డబ్బులు తీసుకోమాకే అన్నాడు...' అంటూ చెప్పాడు. కూలి డబ్బులన్నీ అప్పుడే తీసేసుకున్నాడు గదా! కొడుకు బడాయి మాటలన్నీ తమాషాకి వల్లిస్తున్నాడా? అనుకుంటూ జాన్ మొహం కేసి చూశాను. అక్కడ కనిపించిన భావం మాటల్లో చెప్పగలనా? ఎంతో ప్రశాంతత, ఆనందం, మార్దవం వెలిగిపోతున్నాయి జాన్ మొహంలో. జాన్ టక్కరి వాడు. తాగుబోతు. నిలకడ లేని వాడు. పొగరుబోతు. పైసా ఖరీదు చెయ్యని కొడుకు అప్రయోజకపు మాటలు జాన్‌లో ఇటువంటి భావం కలిగిస్తాయా? ఎందుకని? ఆ మాటల్లో ఏమున్నది? జాన్ అసాధారణ వ్యక్తి, వ్యక్తుల మధ్య నుండే సంబంధాలూ ఆ వ్యక్తుల్లాగే క్లిష్టమూ, సంకీర్ణమూ అయి వుంటున్నాయి. అసలు మనుషుల మధ్య నిజంగా సంబంధం అనేది వుంటుందా? వుంటే దాని స్వభావం ఎలాటిది? ఇదంతా నా బుర్రకు అర్థం అయ్యే విషయంగా తోచలేదు. ఆలోచనల్ని పక్కకునెట్టి, నేను చదవలేక పక్కన పెట్టిన పుస్తకం తీసుకున్నాను.

-అడవి ఏమంత దట్టంగా లేదు. కాకులు దూరని కారడవీ, చీమలు దూరని చిట్టడవీ కాదు. రకరకాల చెట్లు కీసరబాసరగా పెనవేసుకునిపోయి ఉన్నాయి. ఒక్కో చెట్టుకి ఒక్కో విలక్షణత. ఆకులో, కొమ్మలో, రూపులో ప్రత్యేకత. కాని వాటిని గుర్తించగల జ్ఞానం నాకు లేదు. నేత్రోత్సవం కలిగిస్తున్న ఆ దృశ్యంలో నేను గుర్తించగలిగింది ఒక సీతాఫలం చెట్టుని. కాయలు విరగ్గాసి ఉన్నాయ్. అటువంటి చెట్టును నేను ఇదివరకే చూచి వున్నాను. అందుకే గుర్తించాను. మిగతా చెట్లన్నీ కలిసి ఒక అడవి. అందులో ఈ సీతాఫలం చెట్టు....

ఈ ప్రపంచం ఒక అస్పష్టమైన వర్ణచిత్రం. అందులో మనం గుర్తించగలిగేది అంతకు ముందే మనసులో ఎరుకగా ఉన్నదాన్ని మాత్రమే. తనలోని గుర్తునే బయటా గుర్తిస్తాము.

ఒకమనిషి జీవితానికి అర్థం ఇందునుంచే ప్రాప్తించాల్సిందే... ఆ జీవితం

ముందు నుండీ అతనిలో నిబిడీకృతమై ఉన్నదే....

ఒక చిన్న విషయం నుండి పెద్ద సూత్రాన్ని నిర్వచించబూనుకున్నట్లు కనిపిస్తున్నా, ఇది అనుభవసిద్ధమైన విషయమే–

'ఇదేం నవలరా బాబూ' అనుకుంటూ పుస్తకం మూసేశాను.

బీరువాకు తలుపులు బిగించి జాన్, శ్రీరాములూ ఇద్దరూ కలిసి దాన్ని వరండాలోకి తెచ్చిపెట్టారు. ఇహ పాలిష్ చెయ్యాలి.

జాన్‌కోసం మనిషి వొచ్చాడు. ఫిలిప్ మలిదేవిని దాటుతుండగా గభాల్న ఏరువచ్చేసి కొట్టుకు పోయాట్ట. గాభరగా పరుగెట్టాడు జాన్.

తరువాత తెలిసింది ఫిలిప్ శవం దొరికిందని.

జాన్ ఈ దెబ్బకు తట్టుకోలేడు అనుకున్నాను. ఫిలిప్‌కీ జాన్‌కీ వుండే సంబంధం ఎట్లాంటిది!

నాలుగో రోజు పనిలోకి వచ్చాడు జాన్. నాలుగు రోజులకే ముఖమంతా ఒడలిపోయి ముసలివాడయ్యాడు. ఇంతలోనే పనిలోకి రాకపోతేనేం?

'నీకు బాగున్నట్లు లేదు. పనికి తొందర లేదులే. ఇంటికెళ్ళు' అన్నాను సానుభూతితో. 'మైనం రుద్ది పాలిష్ కొడితే బీరువా పని అయిపోతుంది' అన్నాడు ముక్తసరిగా.

జాన్ గొంతులో కొత్తగా ఒక హుందాతనం వచ్చింది. ఈ జాన్‌ని ఎవరూ ఓదార్చ వలసిన పనిలేదు!

ఉప్పుకాగితం, మైనం బాగా రుద్దాడు. పాలిష్ మూడు కోటింగులు చేశాడు.

తొమ్మిది గంటలకు పనిలోకి వచ్చాడు. బయటికి కదలనేలేదు. మధ్యాహ్నం రెండు గంటలైంది పని పూర్తయ్యే సరికి. జాన్ తన సామాన్లు మూట గట్టుకున్నాడు. మిగిలి పోయిన కొయ్యముక్కలూ, పాలిషూ, సీలలూ వప్పజెప్పాడు.

'కూలి ఏమిమ్మంటావ్?' అన్నారు ఆయన.

'మామూలుగా ఈ బీరువాకు నలభై రూపాయలు తీసుకుంటాను. ఇదివరకే ముప్పయి అయిదు ఇచ్చారు. నేను మొదటి చెప్పినదాని కంటే ఖర్చు ఎక్కువై పోయింది. మీ ఇష్టం' అన్నాడు.

జాన్ మాటల్లో ఇదివరకటి అతి వినయం. టక్కరితనం పోయి ఒక హుందాతనం, నిక్కచ్చిదనం వచ్చాయి.

జాన్‌పాల్ చేసిన బీరువా చివరి మెరుగులు దిద్దుకున్నాక నిగనిగలాడి పోతూ నున్నగా, అందంగా వున్నది....

ఇప్పుడు నాకు ఒక్క విషయం తెలిసింది.

మనిషిని ధరించిన మనస్సు అనంతమూ, మహాశక్తివంతమూ అయినది!

అలా అనుకోగానే నాలో స్వేచ్ఛ, ఆనందం వెల్లివిరిశాయి.

***

జాన్‌పాల్ ధైర్యశాలి. బలశాలి. అదే జాన్ నిజస్వరూపం. ధైర్యమూ, బలమూ అనేవి మనిషిలోని సత్యానికి సంబంధించిన గుణాలు. అతను హీనుడుగా, బలహీనుడుగా వుంటే, అది అతని హేళ!

నాది జాన్ స్వభావానికి పూర్తిగా భిన్నమైన స్వభావం. మా నాన్నగారు చనిపోయి నప్పుడు నేను ముక్కలైపోయాను. మళ్లీ మనిషిగా నిలబడడానికి చాలా ప్రయత్నమూ, కాలమూ పట్టింది.

నాన్నగారు పోయాక మొదటిసారి ఆకాశం క్రింద నిలుచున్నాను. పైన శతకోటి నక్షత్రాలూ మిలమిల్లాడుతున్నాయి. వాటిని చూడగానే నాకు గాభరా వేసింది. ఎన్ని నక్షత్రాలూ! వాటిని గురించి నాకేమీ తెలియదే! నాన్నగారూ మేమూ యీ ఆకాశం క్రింద ఎన్నోసార్లు కూర్చున్నాము. నాన్నగారికి ఆ నక్షత్రాల గురించి తెలుసు. వాటిపేర్లు, నడక గురించి అప్పుడప్పుడు చెప్పేవారు. కాని నేను శ్రద్ధగా విని జ్ఞాపకం పెట్టుకోలేదు. నాన్నగారి నడిగితే తెలిసిపోతుంది గనుక. ఇప్పుడు నాన్నలేరు. ఈ నక్షత్రాల గురించి నాకు ఎలా తెలిసేది? చాలా ఆరాటం, భయం, నిస్పృహ, కలిగాయి. ఏమిటో పోగొట్టుకున్నట్లు బాధ....

నాన్నగారున్నప్పుడూ ఆకాశం గురించి నేనేమీ తెలుసుకోలేదు. అప్పుడు నాకు ఉన్నదీ, ఇప్పుడు కొత్తగా పోగొట్టుకున్నదీ ఏమీ లేదు. మరి ఎందుకు నాలో యీ ఆరాటం! దేనికోసం?

ఆ నక్షత్రాలూ అప్పుడూ, ఇప్పుడూ ఎప్పుడూ అలానే మెరుస్తూనే వుంటవి!

జాన్ జ్ఞాపకానికి వచ్చాడు.

మనసులోని బరువు తొలగిపోయి అకారణమైన ఆనందంతో నిండిపోయింది...

మనిషి అనంతుడూ, మహాశక్తిమంతుడూను!

జాన్‌పాల్ చేసిన బీరువా మెరుస్తున్నది.

...............

'బీరువా బాగున్నదే! నా బట్టలూ, పుస్తకాలూ అన్నీ పెట్టుకోడానికి బాగా సరిపోతుంది' అన్నాడు బాబు.

'బాగుంటే నీకేనా? పై అరలు రెండూ నాకు అందవు గనుక నీవు పెట్టుకో. కింది రెండింట్లో నేను పెట్టుకుంటాను' పాప తగవు పెట్టుకుంది అన్నతో.

అసలు బీరువా నాక్కావాలని గదా చేయించుకున్నాను. ముఖ్యంగా కావలసినవన్నీ పోకుండా దాచుకోవచ్చని అనుకున్నానే!

కాని....

ఇప్పుడు నేను దాన్ని ఉపయోగించుకోవచ్చు.

నేను దాన్ని ఉపయోగించుకోకపోవచ్చు.

ఏం చేసినా ఫరవాలేదు.

★

